ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విజయనగరం కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎటువంటి లోపాలు తలెత్తకుండా పరీక్ష నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 21 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 2851 మంది హాజరు కానున్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్ష జరగనుంది. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందు హాజరుకావాల్సి ఉంది. ఈ నెల 28 వరకూ పరీక్షలు జరుగుతాయి. పర్యవేక్షణకు స్క్వాడ్ బృందాలను నియమించారు.



చిన్నారులు.. ప్రాణాలు కోల్పోయింది ఈ కారులోనే..

శోకం

- కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి
- ఒకే కుటుంబంలో అక్కాచెల్లెలు
- మరో కుటుంబంలో ఏకైక కుమార్తె
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రులు అనిత, శ్రీనివాస్



జాస్విత, చారుమతి(ఫైల్)



ఉదయ్ (ఫైల్)



మనస్వి(ఫైల్)

వారంతా
ఒకే గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు.
వేసవి సెలవులు ఇచ్చినప్పటి నుంచి రోజూ కలిసి ఆడుకుంటున్నారు. ఆదివారం కూడా ఒక చోటుకు చేరి కేరింతలు కొట్టారు. సమీపంలో ఆగిఉన్న కారును చూసి సరదాగా డోర్ తీశారు. ఓపెన్ అయిపోవడంతో నలుగురూ లోపలికి వెళ్లి డోర్ వేసుకున్నారు. గాలి ఆడకపోవడంతో డోర్ తీసేందుకు ప్రయత్నించారు. కానీ అవి లాక్ అయిపోయాయి. విషయం తెలియని ఆ చిన్నారులు ఊపిరి ఉన్నంత వరకు హాహాకారాలు చేశారు. కానీ వారి ఆర్తనాదాలు ఎవరికీ వినిపించలేదు. చివరకు నలుగురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.

విజయనగరం/ విజయనగరం క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన మనస్వి (7), మంగి ఉదయ్ (8), బుర్లి జాస్విత (7), చారుమతి (5)లు ఎప్పటిలాగే ఆదివారం ఆడుకుంటున్నారు. అప్పటివరకు కుటుంబ సభ్యుల కళ్ల ఎదుటే కేరింతలు కొట్టారు. సమీపంలో ఆగి ఉన్న కారును చూసి దగ్గరకు వెళ్లారు. డోర్ లాగడంతో అనుకోకుండా తెరుచుకుంది. సరదా పడిన ఆ నలుగురు కారు లోపలికి వెళ్లారు. డోర్ వేశాక ఆటోమేటిక్‌గా అన్నిడోర్‌లు లాక్ అయిపోయాయి. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండడంతో డోర్‌ను తెరిచేందుకు ప్రయత్నించారు. కానీ తెరుచుకోలేదు. లోపలి నుంచి హాహాకారాలు చేశారు. అవి ఎవరికీ వినిపించలేదు. ఆర్తనాదాలు చేస్తూ ప్రాణం విడిచారు. సాయంత్రం అయినా చిన్నారులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని బావులు, కాలువలు, రైల్వేట్రాక్‌లు, తోటల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ కనిపించలేదు. ఆ సమయంలో చిన్నపాటి వాన పడింది. ఆ వర్షానికి కారు అద్దాలు శుభ్రమై అటుగా వచ్చిన వారి కంటికి కారులోపల అచేతన స్థితిలో ఉన్న చిన్నారులు కనిపించారు. వెంటనే కారు అద్దాలు పగులకొట్టి లోపల ఉన్న చిన్నారులను బయటకు తీశారు. జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

● గ్రామానికి చెందిన జోగ పరమేష్ విశాఖలో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వారానికో.. పది రోజులకో తల్లిదండ్రుల వద్దకు (మిగతా 6వ పేజీలో..)

మంత్రులు దిగ్భ్రాంతి..

కారులో నలుగురు చిన్నారులు ఇరుక్కుని ఊపిరి ఆడక మృతిచెందిన విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ అంబేడ్కర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అదితి ఆసుపత్రికి చేరుకుని చిన్నారుల తల్లిదండ్రులను ఓదార్చారు. ఘటనపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న బాధితులు

విజయనగరం ఉలిక్కిపడింది

- ఉగ్రవాద సానుభూతిపరుల అరెస్టుతో కలకలం
- ఓ ఇంట్లో పేలుడు పదార్థాలు స్వాధీనం
- కూపీలాగుతున్న పోలీసులు
- ఆందోళనలో నగరవాసులు



విజయనగరం, మే 18 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఉగ్రవాద ప్రేరేపిత కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులు అరెస్టు అయినట్లు తెలిసి కలవర పడుతున్నారు. నగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహమాన్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన సమీద్ సయ్యర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహస్య ప్రాంతానికి తీసుకెళ్లి విచారించారు. తొలుత సమీద్ ఇచ్చిన సమాచారంతో ఓ ఇంట్లో తనిఖీ చేయగా ప్రమాదకర పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. పేలుళ్లకు వినియోగించే అమోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్ పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది. విజయనగరంలో ఉగ్ర మూలాలు వెలుగుచూడడం సర్వత్రా భయం గొల్పుతోంది. పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం చల్లారక ముందే ఇలా ఉగ్రవాద సానుభూతిపరులు నగరంలో అరెస్టు కావడం కలకలం రేగింది. ఇంకా విజయనగరంలో ఎంతమంది ఉన్నారు? పేలుడు పదార్థాలు నిల్వ ఉంచారా? ఇవి ఎక్కడి నుంచి తెచ్చారు? ఎందుకోసం తెచ్చారు? అన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.

ఆన్‌లైన్‌లో కొనుగోలు..

నిందితుడు సిరాజ్‌ఉర్ రెహమాన్ బీటెక్ చదివాడు. భారీ విస్ఫోటం ఎలా జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇంటర్నెట్ ద్వారా సమాచారం పొందుతున్నాడు. ఆన్‌లైన్‌లో మూడు దఫాలుగా అమోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్ తదితర పేలుడు పదార్థాలను బుక్ చేసి తెచ్చుకుని ఇంట్లో భద్రపరిచినట్లు తెలిసింది. ఇంతమొత్తంలో పేలుడు సామగ్రిని ఎక్కడ.. ఎప్పుడు వాడాలనుకుంటున్నాడో పోలీస్ విచారణలో తేలనుంది. ఈయన తండ్రితో పాటు సోదరుడు పోలీస్ శాఖలో పనిచేస్తున్నట్టు సమాచారం. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న తరువాత సిరాజ్ హైదరాబాద్ వెళ్లాడు. కొన్నాళ్ల అక్కడే ఉన్నాడు. ఆ సమయంలోనే ఆన్‌లైన్‌లో ఎక్కువగా పేలుడు పదార్థాలు, ఉగ్రవాదంపై సెర్చ్ చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. అంతే కాకుండా గతంలో పాకిస్తాన్‌కు అనుకూలంగా తన సామాజిక మాధ్యంలో పోస్టులు పెట్టాడు. దీంతో గత కొద్దిరోజు లుగా సిరాజ్‌పై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటిలిజెన్స్. పోలీస్ విభాగాలు నిఘా పెట్టాయి. వారు ఇచ్చిన సమాచారంతోనే జిల్లాలోని ఉన్నతాధికారులు అప్రమత్తమై పక్కా ఆధారాలతో విజయనగరం పోలీసులు వల వేసి నిందితులను పట్టుకున్నారు. సిరాజ్ ఇచ్చిన సమాచారంతోనే సమీద్ సయ్యర్‌ను సైతం అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. ప్రేరేపిత ఉగ్రవాద ఉచ్చులో సిరాజ్ పడినట్టు సమాచారం. ప్రాథమిక స్థాయి నుంచి ఉగ్రవాద భావ జాలంతో ఉండేవాడని పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. ఈయనపై ఆరు నెలలుగా ఏపీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో నిఘా పెట్టారు. హైదరాబాద్‌లో గత కొంతకాలంగా గడిపిన సిరాజ్ నడవడిక గురించి పోలీసులు కూపీలాగుతున్నారు. ఈ ఇద్దరే ఉన్నారా? లేకుంటే మరికొందరు వచ్చారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బ్యాచిలర్స్‌కు ఇళ్లను అద్దెకిచ్చేవారిలో (మిగతా 6వ పేజీలో..)

అభివృద్ధి.. సంక్షేమమే టీడీపీ లక్ష్యం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రికి మెమొంటో అందిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

గజపతినగరం, మే18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీకి రెండు కళ్లు అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కష్టాలను చూసి అన్న ఎన్టీఆర్ సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు అందించాలన్న ధ్యేయంతో పార్టీని స్థాపించారన్నారు. నాటినుంచి నేటివరకు కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.306 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఈ నియోజకవర్గంలో బొండపల్లి మండలంతో పాటు గజపతినగరం మండలంలోని మరుపల్లిలోనూ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడినవారికి తగిన న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం విజయం సాధించాలన్నారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో ఏడు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో మహానాడు నియోజకవర్గ పరిశీలకులు కోటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, మండల అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరనాయుడు, కోరాడ కృష్ణ, అప్పలస్వామి, మాజీ ఎంపిపి గంట్యాడశ్రీదేవి, మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక



బొబ్బిలి/రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ పదవికి సోమవారం ఎన్నిక జరగనుంది. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ ఈ ఎన్నికకు పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. స్థానిక ఆర్డీవో జివిఎస్ఎస్ రామ్మోహనరావు ప్రిసైడింగ్ అధికారి హోదాలో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకల్లా ప్రిసైడింగ్ అధికారి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి దీనికి సంబంధించిన అన్ని లాంఛనాలను పూర్తిచేయనున్నారు. గతంలో మాదిరిగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉండేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కౌన్సిల్ హాల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు.

● ఛైర్మన్ ఎన్నిక బరిలో ఉండే వ్యక్తి ఉదయం పది గంటలకల్లా ప్రిసైడింగ్ అధికారికి తమ పార్టీకి సంబంధించిన బిఫార్మ్‌ను అందజేయాల్సి ఉంటుంది. సింగిల్ నామినేషన్ దాఖలైన పక్షంలో ఎన్నిక కోసం కౌన్సిలర్‌లు ఎవరూ చేతులెత్తాల్సిన అవసరం లేదు. సింగిల్ నామినేషన్ దాఖలు చేసిన వ్యక్తికి సంబంధించి మరొక కౌన్సిలరు ఆయన పేరును ప్రతిపాదించాల్సి ఉంటుంది. రెండో వ్యక్తి ఆ ప్రతిపాదనను బలపర్చాల్సి ఉంటుంది. దీంతో ఆయన ఎన్నికైనట్లు లాంఛనంగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటిస్తారని కమిషనర్ తెలిపారు. ఒకరి కన్నా ఎక్కువ అభ్యర్థులుంటేనే కౌన్సిలర్లు చేతులెత్తి తమ ఓటును తెలియజేయాల్సి ఉంటుంది.

తుది దశకు హేతుబద్ధీకరణ..!

- గ్రామ, వార్డు సచివాలయ నిర్దిష్ట ప్రయోజన ఉద్యోగుల విభజనపై స్పష్టత
- తాజాగా ఉత్తర్వులు జారీ



శృంగవరపుకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే నిర్దిష్ట ప్రయోజన ఉద్యోగుల సంఖ్యను హేతుబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈమేరకు శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో జిల్లాలో ఏ గ్రామ, వార్డు సచివాలయంలో ఎంత మంది ఉద్యోగులను నియమించాలో వివరంగా చూపించింది. ఏడుగురు నుంచి నలుగురు వరకు గ్రామ సచివాలయాలకు... ఆరుగురు నుంచి ఇద్దరి వరకు వార్డు సచివాలయాలకు కేటాయించారు. ఇంతవరకు ప్రతి గ్రామ సచివాలయంలోనూ ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వే అసిస్టెంట్, వ్యవసాయ /ఉద్యానవన/పట్టుపరిశ్రమ/ అసిస్టెంట్, మత్స/పశుసంవర్ధక అసిస్టెంట్‌లు పని చేసేవారు. ఇప్పుడు కొన్ని గ్రామ సచివాలయాలకు ఇద్దరు ఉద్యోగులు, మరికొన్ని గ్రామ సచివాలయాలకు ముగ్గురు ఉద్యోగులను తగ్గించారు. పంటల సాగు విస్తీర్ణం అత్యధికంగా ఉన్న చోట అదనంగా వ్యవసాయ, ఉద్యాన, మత్స్య అసిస్టెంట్‌లను నియమిస్తారు. రెండు, మూడు సచివాలయాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసే యోచన వుంది. ఈ క్లస్టర్‌లలో తక్కువ ఉద్యోగులు ఉన్నట్లయితే ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వే అసిస్టెంట్‌లకు బాధ్యతలు అప్పగిస్తారు. క్లస్టర్‌లలో తక్కువ ఉద్యోగులు వున్నప్పుడు వారి సంఖ్యను పెంచుతారు. ప్రతి గ్రామ సచివాలయాల్లో ఏఎన్ఎం, ప్రతి వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలు ఉంటారు.

ఇప్పటికే జరిగిన ఉద్యోగుల విభజన

ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు సాధారణ ప్రయోజిత ఉద్యోగల విభజన జరిగిన సంగతి తెలిసిందే. గత నెల 10న (మిగతా 6వ పేజీలో..)

గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్దిష్ట ఉద్యోగుల నియామకం ఇలా

గ్రామ సచివాలయం	వార్డు సచివాలయం
ఏఎన్ఎం (తప్పనిసరి)	హెల్త్ సెక్రటరీ (తప్పనిసరి)
ఇంజనీరింగ్ అసిస్టెంట్ /ఎనర్జీ అసిస్టెంట్ (ఎవరో ఒకరు)	ఎమినిటీస్ సెక్రటరీ/ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ (ఎవరో ఒకరు)
వీఆర్ఓ/సర్వే అసిస్టెంట్ (ఎవరో ఒకరు)	వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ(ఎవరో ఒకరు)
వ్యవసాయ/ఉద్యాన/పట్టుపరిశ్రమ అసిస్టెంట్ (ఎవరో ఒకరు)	శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ
మత్స్య/ పశు సంవర్ధక అసిస్టెంట్ (ఎవరో ఒకరు)	వార్డు సచివాలయాల్లో లేరు

రహదారి బాగులేక.. బస్సులు రాక

ఇదీ.. ఉంగరాడ-ఖండ్యాం రూట్‌లో దుస్థితి

రేగిడి, మే18 (ఆంధ్రజ్యోతి): ఉంగరాడమెట్ట-ఖండ్యాం రహదారిలో గతంలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు నడిచేవి. ప్రస్తుతం రహదారి అధ్వానంగా ఉండటంతో ఆటోలు సైతం నడిచే పరిస్థితి లేకుండా. దాదాపు 9 కిలోమీటర్ల రహదారి. రేగిడి, సంతకవిటి, బూర్జ మండలాలను కలుపుతుంది. ఇలాంటి ప్రధాన రహదారికి కనీస మరమ్మతులు చేపట్టని తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రూట్‌లో బస్సులు అందుబాటు లేకపోవడంతో దాదాపు 10 గ్రామాల ప్రయాణికులు, విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం సాహసమే అవుతోంది.

పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేసినా..

ఉంగరాడమెట్ట- ఖండ్యాం రహదారికి కనీస మరమ్మతులు చేపట్టని తీరు, ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోవడంపై స్థానికులు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఖండ్యాం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఎంపీడీవోను నివేదిక కోరినా తదుపరి చర్యలు లేవని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా వండానిపేట వద్ద బస్సు తిరిగేందుకు స్థలం వాలటం లేదని ఆర్టీసీ అధికారులు తప్పించుకోవడం తగదన్నారు. ఇకనైనా పాలకులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు.



వండానిపేట వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో (ఫైల్)

నేటి నుంచి అసిరితల్లి పండగ

బీపురుపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాంలో సోమవారం నుంచి గ్రామ దేవత అసిరితల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి పండగలో భాగంగా ఈ నెల 12న అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించారు. ఆదివారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. 20న ఘటాల ఊరేగింపు, 21న కనుము పండగను చేపట్టనున్నారు. పండగను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు వీరమణమ్మ, గ్రామపెద్దలు కెల్ల రామారావు, బాణాన రామకృష్ణమనాయుడు, దుగ్గు రామకృష్ణ, డి.మల్లేశ్వరరావు తెలిపారు.

లయన్స్ కార్యవర్గం ఎన్నిక

చీపురుపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 2025-26 సంవత్సరానికి అధ్యక్షుడిగా కోరాడ శంకరరావు, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా నాగశంకర్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ప్రస్తుత అధ్యక్షుడు డి.సీతారామరాజు, బెల్లాన వంశీకృష్ణ, ఎస్.సన్యాసిరావు, ఆర్.శ్రీనివాస్ పట్నాయక్, ఒమ్మి రమేష్, ఎన్.రాధాకృష్ణ, ఎస్.వెంకటేశ్ తదితరులు హాజరయ్యారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

విజయనగరం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం జంక్షన్‌లో సోమవారం ఉదయం ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు హాజరుకానున్నారు.

ప్రమాద బీమా కిట్ల పంపిణీ

జామి, మే 18 (ఆంధ్రజ్యోతి): జామిలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఆదివారం ప్రమాద బీమా కిట్లను పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు పీవీఆర్ పద్మారావు వాటిని సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వారాధి స్వామినాయుడు, శ్రీను, వాసు, గోవింద, పేరునాయుడు, కిలారి రామ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

రాజాం, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ సారధి రోడ్డులో మరమ్మతులకు గురైంది. దీంతో కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజు ఆదివారం మరమ్మతులు చేయించారు. పైపులైన్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి సోమవారం అన్ని వార్డులకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ వెంకటరామరాజు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి రూ.30 వేలు

పూసపాటిరేగ, మే18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్దూరు పంచాయతీ పరిధిలో కలుగుపేటలో సీతారామలయ నిర్మాణానికి జనసేన పార్టీ మండల నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కొట్ల రఘు రూ.30 వేల విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో వెల్దూరు పంచాయతీ నాయకులు దారపు గున్నారెడ్డి, కలుగు లక్ష్మణ్, కలుగు సత్తిరెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల, మే 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు, సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథ తెలిపారు. మరుపాడ, పినతాడి, పెదతాడివాడ, బొప్పడాం, వల్లూరు, బుద్ధన్నపేట, కొండపేట, వమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వేపాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): వేపాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరుపేద కృష్ణకు చెందిన పశువులశాల దగ్ధమైన నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్టు సభ్యులు రూ.12 వేలు ఆర్థికసాయం చేశారు. అగ్ని ప్రమాదంలో కృష్ణ పశువుల పాక పూర్తిగా కాలిపోవడంతో పాటు రెండు ఆవులు సజీవ దహనమయ్యాయి. దాంతో రైతు కుటుంబానికి ట్రస్టు సభ్యులు అండగా నిలిచి సాయం చేశారు.

సైనికుల సేవలను మరువలేం

గజపతినగరం మే18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత ప్రతిష్ఠను ప్రధాని మోదీ పెంపొందించారని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక చంపావతి వంతెన నుంచి నాలుగురోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికుల సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముర్రాపు సురేష్, నియోజకవర్గ బీజేపీ నాయకుడు, దుర్గాప్రసాద్, ఎంపీడీవో బి.కళ్యాణి, అధికారులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

●వేపాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో వేపాడ -వల్లంపూడి జంక్షన్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. జనసేన పార్టీ మండల నాయకుడు సుంకరి అప్పారావు, బీజేపీ మండల నాయకుడు గోరాడ మహేశ్, లక్ష్మల పవన్ సారధ్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి, భీమవాదం నశించాలని నినదించారు.



వేపాడలో తిరంగా ర్యాలీ..

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

విజయనగరం రింగురోడ్డు, మే 18 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా కోట జంక్షన్ వద్ద హనుమాన్ భక్తులు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. హనుమాన్ భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం కోట నుంచి మూడ లాంతర్లు మీదుగా ఎం.జి.రోడ్డు, కన్యకాపరమేశ్వరి కోవెల, కలెక్టరేట్ జంక్షన్ వరకు యాత్ర సాగింది.



నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జవాన్ల త్యాగం చిరస్మరణీయం

మెంటాడ, మే18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో అసువులు బాసిన వీర జవాన్ల త్యాగనిరతి చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఇటీవల భారత్-పాక్ యుద్ధంలో అమరుడైన మురళీ నాయక్ సహా కన్నోళ్ల కిందట జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మెంటాడ గ్రామానికి జవాన్ మీసాల రామకృష్ణ, చైనాతో యుద్ధంలో ప్రాణాలర్పించిన సంతోషబాబులకు క్విక్ డోనర్ సర్వీస్ ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం మెంటాడలో వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో కొల్లా భరత్‌కుమార్, వాసు, శివాజీ, ప్రసాద్, చిరంజీవి, రంగారాజు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయం

వేపాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. దాంతో మండల వ్యవసాయాధికారి వల్లంపూడి ఆర్‌బీకే నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయం మరమ్మతులకు గురై దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



శిథిలావస్థకు చేరిన కార్యాలయమిదే..

నన్నే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు..

●ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని కోరితే చర్యలేవీ
●రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు
●తీరు మారకుంటే పోరాటం చేస్తా
●రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్సీ సంచలన వ్యాఖ్యలు

శృంగవరపుకోట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను రక్షించాలని కోరిన తననే రెవెన్యూ అధికారి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ఆక్రమణలపై ప్రశ్నించిన ప్రతిసారీ సదరు అధికారి తనపై రుబాబు చేస్తున్నాడని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం మండలంలోని ముషిడిపల్లి వాసులు ప్రభుత్వ చెరువులు, డీపట్టా స్థలాలు ఆక్రమణ జరిగాయని, రెవెన్యూ అధికారులకు కొన్నేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ విషయంపై గత ప్రభుత్వం నుంచి కలెక్టర్ నుంచి తహసీల్దారు వరకు తెలియజేశానన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. లేఅవుట్‌కు డీపట్టా భూముల మీదుగా చెరువు గర్భాన్ని కలుపుకుని రోడ్డు వేశారన్నారు. దీనికి సంబంధించి 2016లో పంచాయతీ నుంచి తప్పుడు తీర్మానం సృష్టించారన్నారు. దీనిపై రెండేళ్ల కిందట డీపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ లేఅవుట్‌లో నాలుగు ప్రభుత్వ చెరువుల ఆక్రమణ జరిగిందన్నారు. వీటిని చూడాల్సిన జలవనరుల శాఖ అధికారులు తమ పనికాదన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను కలుపుకుని లేఅవుట్ వేశారనే ఫిర్యాదు మేరకు అప్పట్లో రెవెన్యూ అధికారులు సంబంధిత రియల్ వ్యాపారులకు నోటీసులు ఇచ్చారన్నారు. సదరు వ్యాపారులు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. అయితే వారు కోర్టు నిబంధనలను తుంగలో తొక్కి లేఅవుట్ ప్రారంభోత్సవాలు చేశారన్నారు. ఆ సమయంలో పెద్దపెద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను పెట్టారన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ రోజుకు తహసీల్దార్ వాటిని తీయించారన్నారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖలో ఓ అధికారి వారికి వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ ఆక్రమణలపై మాట్లాడిన ప్రతిసారి తాను గెడ్డ ఆక్రమణ చేశానంటూ తిరిగి నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. తనకు తెలియకుండా నిర్మాణం జరిగిందని దాన్ని తొలగించుకోవచ్చని 2009 లోనే లేఖ ఇచ్చానని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. మరోసారి కలెక్టర్‌ను కలిసి ఇక్కడి ఆక్రమణలను వివరిస్తానన్నారు. స్పందన లేకపోతే రైతుల తరపున తానే ఇక్కడ టెంట్ వేసి పోరాటం చేస్తానని ఆయన హెచ్చరించారు.



ఎమ్మెల్సీకి రోడ్డును చూపిస్తున్న రైతులు

ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు: కళా

రాజాం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ రైతులందరికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వం సాగునీరు అందిస్తుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ పంటకు ఏర్పాట్లు చేయాలని ఇటీవల జిల్లాలో పర్యటించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారన్నారు. వైసీపీ హయాంలో సాగునీటికి రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి కాలువల్లో జంగిల్ క్లియర్ చేయిస్తోందన్నారు. తోటపల్లి కాలువ ద్వారా ప్రతి రైతుకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు అందించడానికి నిల్వలు సిద్ధం చేసిందన్నారు. ఈ ఏడాది రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కళా అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన కుప్పిలి

రాజాం, మే 18 (ఆంధ్రజ్యోతి): కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావును రాజాం నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి రిజర్వాయర్లు, రేగిడి ఆమదాలవలస ఓపెన్ హెడ్ చానల్, సాయన్న ఛానల్, సంకిలి షుగర్ ఫ్యాక్టరీ రైతుల సమస్యలు, రైస్ మిల్లులు, మూతపడిన పరిశ్రమల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజాం మండల అధ్యక్షుడు బెవర సత్యంనాయుడు, కనకల రాజశేఖర్, మజ్జి నరసింహనాయుడు తదితరులు ఉన్నారు.



ప్రభాకరరావుతో కుప్పిలి చైతన్యకుమార్

సంతోషంగా తిరిగాడి.. అంతలోనే కుప్పకూలి

● కుమార్తె పెళ్లిలో తల్లి మృతి ● పాతబగ్గాంలో విషాదం

గజపతినగరం, మే18 (ఆంధ్రజ్యోతి): కూతురు వివాహం మరికొద్ది గంటల్లో జరుగుతున్న తరుణంలో తల్లి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని పాతబగ్గాం గ్రామానికి చెందిన పప్పల పైడమ్మ (52) కుమార్తె గౌరికి దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన పైడాల సన్యాసిరావుతో వివాహం నిశ్చయమైంది. ఆదివారం రాత్రి వివాహం జరగాల్సి ఉంది. వివాహ వేడుకలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పెళ్లి భోజనాలు జరుగుతున్న సమయంలో పైడమ్మ సంతోషంగా తిరిగారింది. అంతలోనే దప్పిక కోసం ఇంటిలో బీరువా తెరుస్తూ అక్కడే కుప్పకూలి మృతిచెందింది. తల్లి మృతితో కుమార్తె గౌరి పెళ్లి ఆగిపోయింది. పైడమ్మ భర్త సూరి ఐదేళ్ల కిందట మృతి చెందారు. కూలి పనులు చేసుకుంటూ పైడమ్మ జీవనం సాగిస్తోంది. తండ్రిలేని లోటు కనిపించకుండా గౌరిని చూసింది. కుమార్తెకు పెళ్లి చేస్తున్న సమయంలో ఆమె మృతి చెందడంతో పెళ్లింట విషాద చాయలు అలముకున్నాయి.



పైడమ్మ (ఫైల్)

వ్యక్తి ఆత్మహత్య

మెరకముడిదాం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గదబవలసలో ఆదివారం ఉరి వేసుకుని ఒక వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. గదబవలస గ్రామానికి చెందిన ఆరంగి అప్పలనాయుడు (42) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బుదరాయవలస ఎస్ఐ జె.లోకేశ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

గంజాయితో యువకుడి అరెస్టు

నెల్లిమర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిద నారాయణపట్నం వంతెన సమీపంలో గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేశామని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నారాయణపట్నం వంతెన సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన యశ్వంత్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడి నుంచి వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టుగా ఒడిశాపాలోని రాయగడ నుంచి గంజాయిని కొనుగోలు చేసి సేవిస్తున్నట్టు అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

సంతకవిటి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోనుగుటివలస లో బొండాడ నారాయణపై తమ్ముడు కొడుకు బొండాడ గణేష్ శనివారం రాత్రి దాడి చేశాడని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గణేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బొండాడ నారాయణ, బొండాడ గణేష్ కుటుంబాలకు పాత తగాదాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో శనివారం తాగిన మైకంలో గణేష్ నారాయణపై దాడి చేశాడన్నారు. నారాయణ చేతికి గాయమైందన్నారు. నారాయణ ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ జేఎల్ఎంపై దాడి

మెంటాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటినవలసకు చెందిన విద్యుత్ జూనియర్ లైన్‌మన్ యాదగిరిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆండ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు. గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయం కలగడంతో స్థానికులు శనివారం రాత్రి జేఎల్ఎంకు ఫిర్యాదుచేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు జేఎల్ఎం గ్రామానికి వెళ్లారు. నిత్యం విద్యుత్ సమస్య ఏర్పడుతుందని స్థానికులు వాపోయారు. ఈ క్రమంలో వారి మధ్య మాటామాట పెరిగింది. దీంతో జేఎల్ఎంపై వారు దాడిచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు జేఎల్ఎం ఫిర్యాదు చేశారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం

వేపాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని మాల మహానాడు, ఆంధ్రప్రదేశ్ దళిత కూలీ రైతు సంఘం మండల నాయకులు దేవరాపు కిరణ్, బోర అప్పారావు, మెరిపాక సన్యాసిరావు, పుచ్చ సుధాకర్ అన్నారు. ఆదివారం వేపాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతిలో కులం పేరుతో దూషించడమేకాక బీటెక్ విద్యార్థి అస్సందుకు రాళ్లతో దాడి చేసి, మూత్రం తాగించడం అమానుష చర్య అన్నారు. ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబుపాలనలో దళిత వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. పదవుల పంపకం, పథకాల మంజూరులో దళితులకు న్యాయం జరగడంలేదన్నారు. తిరుపతిలో దళిత విద్యార్థిపై దాడి చేసిన నాయుడు, అతడికి సహకరించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. దళిత విద్యార్థి తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించక పోవడం దారుణమన్నారు. దీనికి కారణమైన పోలీసులను తక్షణమే విధుల నుంచి తప్పించాలని వారు డిమాండ్ చేశారు.

60 మందికి నేత్ర పరీక్షలు

దత్తిరాజేరు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం లో ఆదివారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెంకటరామ ఆసుపత్రి వైద్యులు 60 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గేదెల మంగమ్మ, గాడి అప్పలనాయుడు, గేదెల రామసత్యం, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సందడిగా అపూర్వ సమ్మేళనం



నెల్లిమర్ల: జరజాపుపేట ఉన్నత పాఠశాలలో..



లక్కవరపుకోట (కొత్తవలస): కొండదాడా ఆర్‌సీఎం పాఠశాలలో..

నెల్లిమర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన 1996-97 బ్యాచ్‌లో టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం సందడిగా నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 28 ఏళ్ల తర్వాత అందరూ కలిశారు. యోగక్షేమాలు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన మిత్రులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన టీడీపీ నాయకుడు కళ్ల రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి బుగత లక్ష్మణరావు, రైల్వే ఉద్యోగి కళ్ల నారాయణరావు, వ్యాపార వేత్త అవనాపు మురళీకృష్ణ, బ్యాంకు ఉద్యోగి తాలాడ లెనిన్ తదితరులు ఏర్పాట్లు చేశారు.

●లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని కొండదాడా ఆర్‌సీఎం పాఠశాలకు చెందిన 2005-06 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదే పాఠశాలలో ఆదివారం సందడిగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా చేరుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 20 ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వివాహిత హత్య

● వెంకటరమణపేటలో ఘటన

● కుటుంబ సభ్యులపై అనుమానం ● బావిలో మృతదేహం


వెంకటలక్ష్మి (ఫైల్)

శృంగవరపుకోట రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): వెంకటరమణపేట గ్రామానికి చెందిన వివాహిత కిడ్నాప్ అయ్యి తరువాత హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్రప్రగడ వెంకటలక్ష్మి(38) శనివారం రాత్రి పదిగంటల సమయంలో కుమార్తెతో బయటకు వెళ్లింది. కాసేపటికి కుమార్తె ఒంటరిగా తిరిగి వచ్చింది. అమ్మ ఎక్కడుందని అన్నయ్య హరీష్ ప్రశ్నించగా కొందరు వ్యక్తులు వచ్చి కిడ్నాప్ చేసి ఆటోలో ఎత్తుకుపోయా రని, తనను పక్కకు తోసేశారని చెప్పింది. వెంటనే హరీష్ ఈవిషయం గ్రామస్థులతో పాటు గ్రామపెద్దలు, యువతకు చెప్పడంతో చుట్టుపక్కల గ్రామాలకు బైక్‌లతో వెళ్లి వెతకడం ప్రారంభించారు. ఇదే సమయంలో పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీసు లు ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఆదివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో కూడా పరిశీలించారు. అంతలో గ్రామ సమీపంలో ఉన్న బావిలో ఆమె మృతదేహం ఉన్నట్లు తెలియడంతో అందరు అక్కడకు చేరుకున్నారు. ఆమె వెంకటలక్ష్మిగా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీ లించి వివరాలు సేకరించారు.

కుట్రకోణం..?

మహిళ హత్య ఘటనలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. వెంకటలక్ష్మి మరణం వెనుక పెద్దకుట్ర ఉందంటున్నారు. కుమార్తెపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె, ప్రియుడు కలిసి వెంకటలక్ష్మిని హత్య చేసి ఉండొచ్చునన్న కొందరు భావిస్తున్నారు. పూర్తివివరాలు చేప్పేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు.

విజయనగరం
ఉలిక్కిపడింది

(మూడో పేజీ తరువాయి)

ఒక రకమైన ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల వారికి ఇళ్లను అద్దెకు ఇవ్వాలంటేనే స్థానికులు భయపడిపోతున్నారు.

పెరుగుతున్న నేర సాంస్కృతి..

ఒడిశా, చత్తీస్‌గఢ్‌లకు విజయనగరంతో కనెక్టవిటీ ఉంది. ఇటు విశాఖకు కూతవేటు దూరంలో ఉంది. అటు పర్యాటక ప్రాంతం అరకుకు కూడా దగ్గరగా ఉంది. ఒడిశాతో పాటు చత్తీస్‌గఢ్ వెళ్లాల్సిన వారు విజయనగరం జంక్షన్‌నే ఆశ్రయిస్తుంటారు. ఈ తరుణంలో ఎక్కువ మంది ఉత్తరాది రాష్ట్రాల వారు నగరానికి వస్తుంటారు. ఉపాధి కోసం వచ్చేవారు అధికం. చిరువ్యాపారులు, ఫుట్ పాత్ వ్యాపారం చేసేవారు కూడా ఉన్నారు. కొంతకాలంగా గంజాయితో పాటు నిషేధిత వస్తువులతో ఉత్తరాది రాష్ట్రాల వారే పట్టుబడుతున్నారు. నేర నియంత్రణ సాధ్యం కావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉగ్ర ఛాయలు కనిపించడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులకు ఇది ఒక సరికొత్త సవాలే.

విశాఖకు బదులుగా ఇక్కడ?

విశాఖకు కూతవేటు దూరంలో విజయనగరం ఉంది. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని నగరాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. విశాఖ నగరంలో అడుగడుగునా పోలీసులు తనిఖీలు చేపట్టారు. అణువణువూ జల్లెడ పట్టారు. 1971లో సైతం పాకిస్తాన్‌తో యుద్ధ సమయంలో విశాఖపై జలంతర్గామితో దాడి జరిగింది. అందుకే విశాఖలో ఈసారి తనిఖీలు పెరిగాయి. అందుకే ఉగ్రవాద సానుభూతి పరులు విజయనగరాన్ని ఎంపిక చేసుకున్నారా? అన్న అనుమానం అందరినీ కలుగుతోంది. విశాఖ నగరంలో పోర్టుతో పాటు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలున్నాయి. వాటిపై దాడికి రెక్కీ చేశారా? అన్న అనుమానాలు తాజాగా కలుగుతున్నాయి.

తీరప్రాంతం..

జిల్లాలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. వాటిని లక్ష్యంగా చేసుకుని ఏమైనా ప్రణాళిక వేశారా? అన్న అనుమానమూ పలువురిలో కలుగుతోంది. జిల్లాలో 29 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉంది. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో పదుల సంఖ్యలో మత్స్యకార గ్రామాలున్నాయి. అయితే ఒక్క మెరైన్ పోలీస్ స్టేషన్ కూడా లేదు. దీంతో తీర ప్రాంత భద్రత డొల్లగా మారింది. తీరం గుండా ఉగ్రవాదులు జిల్లాలో ప్రవేశిస్తే పరిస్థితి ఎంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఎలా పరిచమయ్యారు?

● సిరాజ్ సాంకేతిక పరిజ్ఞానంతో ఉగ్రవాద కార్యకలాపాల వైపు మొగ్గుచూపే వ్యక్తులను ఇన్‌స్టా గ్రామ్ ద్వారా పరిచయం చేసుకునేవాడు. ఈ విధంగానే హైదారాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్‌తో కలిసి ఉంటున్నాడు. ఈ విషయాన్ని నిఘా వర్గాలు గ్రహించి ముందస్తు చర్యలు తీసుకోవటంతో భారీ విధ్వంసం తప్పిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి ఇతర దేశాల్లోని 'ఐసిస్' వంటి ఉగ్రవాద సంస్థలతో ఏమైనా పరిచయాలు ఉన్నాయా అని నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

● విజయనగరంలోని అంబటిసత్రం వద్ద నివాసముంటున్న సిరాజ్ తండ్రి, సోదరుడు ఇద్దరు పోలీస్ శాఖలో పనిచేస్తున్నారు. సిరాజ్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడడం, పేలుళ్ల సామగ్రి కలిగి ఉండడం, ఉగ్రవాద దేశాల సంస్థలతో సంబంధాలు ఉండడం, దేశ రహస్యాలను చేరవేయడం తదితర అంశాలకు సంబంధించిన సెక్షన్‌లపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. విజయనగం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

తుది దశకు హేతుబద్ధీకరణ

(మూడో పేజీ తరువాయి)

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులలో స్పష్టత ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రతి గ్రామ వార్డు సచివాలయంలోను 8నుంచి 12 మంది చొప్పున ఉద్యోగులు పని చేస్తున్నారు. హేతుబద్ధీకరణతో ఆరుగురు నుంచి పది మంది వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేయనున్నారు. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, (గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5వరకు), డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ, విద్యా సహాయకులు, గ్రామ మహిళా పోలీస్, వార్డు సచివాలయాల్లో వార్డు అభివృద్ధి కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రొసెసింగ్ కార్యదర్శి, వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శి, వార్డు మహిళ పోలీస్‌లను సాధారణ ప్రయోజిత కేటగిరిగా పరిగణించారు.

కేటగిరి వారీగా సాధారణ ప్రయోజన ఉద్యోగుల

నియామకం ఇలా..

కేటగిరి ఏ విభాగంలో 2500లోపు జనాభా వున్న గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి లేక డిజిటల్ అసిస్టెంట్ ఎవరో ఒకరు, సంక్షేమ, విద్యా అసిస్టెంట్, లేక మహిళ పోలీస్‌ల్లో ఎవరో ఒకరు ఇలా ఇద్దరు, వార్డు సచివాలయంలో వార్డు అభివృద్ధి కార్యదర్శి, లేక వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రొసెసింగ్ కార్యదర్శుల్లో ఎవరో ఒకరు ఉంటారు. వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి, మహిళ పోలీస్‌లలో ఎవరో ఒకరు మాత్రమే పనిచేస్తారు. కేటగిరి బి విభాగంలోని 2,501 నుంచి 3,500 వరకు వున్న గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ, విద్యా అసిస్టెంట్ లేక మహిళ పోలీస్‌ల్లో ఒకరు ఇలా ముగ్గురు, వార్డు సచివాలయాల్లో వార్డు అభివృద్ధి కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రొసెసింగ్ కార్యదర్శి, వార్డు సంక్షేమం, అభివృద్ధి కార్యదర్శి లేక మహిళ పోలీస్‌ల్లో ఒకరు ఇలా ముగ్గురు ఉద్యోగులు పని చేసేలా చర్యలు తీసుకున్నారు.. కేటగిరి సీ విభాగంలో 3501కు పైబడి వున్న జనాభా కలిగిన గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమం, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళ పోలీస్ నలుగురూ, వార్డు సచివాలయాల్లో వార్డు అభివృద్ధి కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రొసెసింగ్ కార్యదర్శి, వార్డు సంక్షేమం, అభివృద్ధి కార్యదర్శి మహిళ పోలీస్ నలుగురూ సాధారణ కేటగిరి కింద నియమించారు.

టీడీపీకి కార్యకర్తలే బలం

● ఎమ్మెల్యే విజయచంద్ర

● పార్వతీపురంలో మినీ మహానాడు


విజయ సంకేతం చూపిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


సభకు హాజరైన పార్టీ శ్రేణులు

పార్వతీపురం/బెలగాం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే తెలుగుదేశం పార్టీ బలమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్యకర్తలే టీడీపీకి బలం అని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఇన్సూరెన్స్ వంటివి ప్రవేశపెట్టిన మొట్టమొదటి పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. గత 30 ఏళ్ల నుంచి ఒక లెక్క.. ఇప్పటి నుంచి ఒక లెక్క. అని, కార్యకర్తలు ఏ క్షణంలోనైనా తనను కలిసి సమస్యలు తెలపవచ్చన్నారు. పార్వతీపురానికి మహాప్రీతి కంపెనీ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ముందుగా పలువురు కళాకారులు నాటికలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి, నగదు బహుమతిని అందజేశారు.

ఇదీ అభివృద్ధి..

ఈసందర్భంగా టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో పార్వతీపురం నియోజకవర్గానికి రూ.70 కోట్లు నిధులు తీసుకొచ్చి, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని చెప్పారు. చినఅంకలాం నుంచి బూర్జి వరకు రూ.9 కోట్ల నిధులతో సాగునీరు అందించేందుకు ప్రణాళికలు చేపట్టామని తెలిపారు. మున్సిపాలిటీలో తాగునీరు అందించేందుకు రూ.80 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. జంఝావతి నుంచి మున్సిపాలిటీకి తాగునీరుకు ప్రతిపాదించామని, జంఝావతికి రూ.51 కోట్లు నిధులు మంజూరు చేశామని ఆయన వివరించారు. జిల్లా కేంద్రంలో అధునాతన ఆసుపత్రి నిర్మాణానికి రూ.52 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. పట్టణంలో పులిగుమ్మి నుంచి లేదా హెచ్.కారాడ వలస నుంచి శివిని వరకు బైపాస్ నిర్మాణానికి రూ.700 కోట్లతో ప్రణాళికలు పంపించామన్నారు. ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డు పైడిరాజు, పార్టీ నాయకులు జి.వెంకటనాయుడు, గుంట్రెడ్డి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బోను చంటి, రౌతు వేణు, పెంకి వేణు, టీడీపీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

● ఒరుగుతున్నా పట్టించుకోని అధికారులు


బొబ్బిలి ఐటీఐ కాలనీ వద్ద వాలిపోయి ఉన్న విద్యుత్ స్తంభం

సీతంపేట రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): రోలుగుడ్డి గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. గ్రామంలో ఓ విద్యుత్ స్తంభానికి కర్రను దన్నుగా పెట్టిన పరిస్థితి కనిపించింది. ఈ స్తంభం ఎప్పుడు నేలకొరిగి, ఇళ్లపై వైర్లు తెగిపడతాయోనని గ్రామస్థులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఎన్నిసార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవట్లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ● బొబ్బిలి రూరల్: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి ఐటీఐ కాలనీ శివారున ఓ విద్యుత్ స్తం భం ప్రమాదకరంగా వాలిపోయి ఉంది. ఇటీవల కొద్దిరోజుల నుంచి వీస్తున్న గాలులకు ఇలా ప్రహరీ పైకి వాలిపోయింది. ఎప్పుడు నేల కూలిపోతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సీతంపేటరూరల్: రోలుగుడ్డిలో విద్యుత్ స్తంభానికి కర్ర దన్నుపెట్టిన దృశ్యం

పాఠశాల స్థలం స్వాధీనం

● పి.వెంకంపేట గ్రామస్థుల హర్షం


బుడా చైర్మన్ తెంటు బ్యాటింగ్ చేస్తుండగా ఎమ్మెల్యే బేబీనాయన వికెట్ కీపింగ్ చేస్తున్న దృశ్యం

బాడంగి, మే 18 (ఆంధ్రజ్యోతి): పి.వెంకంపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలం గత కొన్నేళ్లుగా వైసీపీకి చెందిన ఓ వ్యక్తి ఆధీనంలో ఉండేది. దీనిపై గ్రామస్థులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఎమ్మెల్యే బేబీనాయనకు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి, ప్రైవేటు వ్యక్తి చేతిలో ఉన్న స్థలాన్ని ఆదివారం స్వాధీనం చేసుకుని, గ్రామస్థులు అప్పగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ పాఠశాల స్థలాన్ని క్రీడా స్థలంగా మార్చి ఆదివారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎమ్మెల్యేతో పాటు బుడా చైర్మన్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు వారు క్రీడల్లో పాల్గొన్నారు. బుడా చైర్మన్ బ్యాటింగ్ చేయగా ఎమ్మెల్యే వికెట్ కీపింగ్ చేసి పిల్లలతో కలిసి ఆటలాడారు. ఈసందర్భంగా వారు మా ట్లాడుతూ వైసీపీ నాయకుడు కబ్జా చేసుకున్న స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని పాఠశాలకు అప్పగించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ మైదానాన్ని పిల్లలతోపాటు యువకులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ అధ్యక్షుడు తెంటు రవి, లచ్చుపతుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘోరం

(మూడో పేజీ తరువాయి)

వస్తుంటాడు. అదేక్రమంలో ఆదివారం ఇంటికి వచ్చాడు. కారును రోడ్డుపై పార్క్ చేశాడు. అంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది.

● కంది సురేష్, అరుణ దంపతుల ఏకైక కుమార్తె మనస్వి (7) రెండో తరగతి చదువుతోంది. సురేష్ కలాసీగా పని చేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. మంగి బుచ్చినాయుడు, భవానీ దంప తులకు ఇద్దరు పిల్లలు కాగా ఉదయ్(8) మూ డో తరగతి చదువుతున్నాడు. బుచ్చినాయుడు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బూర్లి ఆనంద్, ఉమామహేశ్వ రి దంపతులకు ఇద్దరు కుమార్తెలు జాస్విత (7) చారుమతి (5) ఉండగా వీరు ఒకటో తర గతి, రెండోతరగతి చదువుతున్నారు. ఆనంద్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. ఉన్న ఇద్దరు కుమార్తెలు మృత్యువా త పడటంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఆడుకుంటానని చెప్పి విగతజీవులుగా వచ్చారా తల్లీ అంటూ గుండెలవిసేలా రోదించారు.

పార్టీ మారిన కౌన్సిలర్లు రాజీనామా చేయాలి

పాలకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాలకొండ నగర పంచాయతీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కూటమిలో చేరారని, వారు వైసీపీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటి వద్ద ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ మారిన కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వైసీపీ పెద్దలే తమను పార్టీ మారాలని చెప్పారని అనడం సరికాదన్నారు. వారు ముందు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం తప్పదు

సాలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం ప్రారంభం అయినప్పుడు కొంత సమయం విద్యుత్ సరఫరాకు అంతరాయం తప్పదని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిమానోత్సవం ప్రారంభించిన సమయానికి 2 గంటల ముందు నుంచే సిరిమాను తిరిగే వీధులైన నాయుడువీధి, అల్లువీధి, శివాజీ జంక్షన్, బోసుబొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డు, గొల్లవీధి, తోటవీధులలో విద్యుత్ అంతరాయం తప్పదని ఆయన వివరించారు. సిరిమానోత్సవం పూర్తయిన వెంటనే మళ్లీ ఆయా వీధులకు విద్యుత్ సేవలు పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని పట్టణవాసులు గమనించాలన్నారు. విద్యుత్ శాఖకు ప్రతిఒక్కరూ సహకరించి ఉత్సవం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

మినీ మహానాడు కోసం స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద స్థలాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం పరిశీలించారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, నాయకులు కోలా రంజిత్ కుమార్, దాసరి రామారావునాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా సోమేశ్వర ఆలయ ప్రారంభోత్సవం

సీతానగరం, మే 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణరాయపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖి సోమేశ్వర ఆలయ ప్రారంభోత్సవంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం పాల్గొన్నారు. సర్పంచ్ అన్నంనాయుడుతో పాటు గ్రామస్థులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన కలశానికి ఎమ్మెల్యే పూలమాల వేసి, పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రౌతు వేణుగోపాల్ నాయుడు, ఆర్.సింహలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బాడంగి, మే 18(ఆంధ్రజ్యోతి): బాడంగిలోని తెంటు బంగ్లాలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు ఆదివారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన మత్స వేణమ్మకు రూ.లక్షా 70 వేల 417, అల్లుపాల్తేరు గ్రామానికి చెందిన అల్లు అరుణకు రూ.65వేల 983, అలాగే తెర్లాం మండలం వెలగవలస గ్రామానికి చెందిన మహంతి శాంతికి రూ.లక్షా 48వేల 799 చెక్కులను అందజేశారు. టీడీపీ బాడంగి మండల అధ్యక్షుడు తెంటు రవి, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, యేగిరెడ్డి శ్రీదర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్: బొబ్బిలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధిని పంపిణీ చేశారు. బొబ్బిలి పట్టణం స్వామివారివీధికి చెందిన నాయుడు జగదీష్ కుమార్‌కు రూ.2లక్షలు, పట్టణంలోని 6వ వార్డుకు చెందిన కోరాడ పద్మావతికి రూ.50వేలు, జగన్నాథపురం గ్రామానికి చెందిన పొట్నూరు గణపతికి రూ.5లక్షల 72వేల 573, రామభద్రపురం మండలం, జన్నివలస గ్రామానికి చెందిన గెడ్డ గణేష్‌కు రూ.95వేల165 విలువ గల చెక్కులను ఆయన అందజేశారు.

సాగునీటి వనరులను పరిరక్షిస్తాం

బొబ్బిలి రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వనరులను పరిరక్షిస్తామని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి వనరులు ఆక్రమణకు గురవుతున్నాయని, దీంతో రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, చెరువుల పరిరక్షణపై పోరాటం చేసేందుకు ఈనెల 27న పార్వతీపురం ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించి, నూతన కమిటీలు నియమిస్తామని ఆయన తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రావుపల్లిలో ప్రత్యేక పూజలు

● నేడు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గరుగుబిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): రావుపల్లి గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మూడు రోజుల పాటు పలు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. పుర వీధుల్లో కళశాలతో శోభాయాత్ర నిర్వహించారు.

పునాదులకే పరిమితం

● అసంపూర్తిగా పాఠశాలల అదనపు భవన నిర్మాణాలు

● గిరిజన విద్యార్థులకు వెంటాడుతున్న వసతి సమస్య


కురసింగిలో పునాది దశలో నిలిచిపోయిన పాఠశాల భవనం

సీతంపేట రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో చదువుతున్న గిరిజన చిన్నారులకు కొన్నేళ్లుగా వసతి సమస్య వెంటాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద మండలంలో కురసింగి, జల్లార, గుడ్డిమీదగూడ తదితర గిరిజన గ్రామాల్లో పాఠశాల అదనపు భవనాల నిర్మాణాలకు అరకొర నిధులు మంజూరు చేశారు. దీంతో చాలా పాఠశాలల భవనాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. ఈ నిర్మాణాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పునాదులకు సైతం బీటలు వారే పరిస్థితి నెలకొంది. ఈ భవన నిర్మాణాలు చేపట్టి సుమారు మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు పూర్తికాకపోవడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న పాఠశాల ల భవనాల్లోనే సర్దుకుపోయి చదువుకుంటున్నారు. మండలం లో పునాది దశలోనే నిలిచిపోయిన పాఠశాలల భవనాలు సుమారు 20 ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా ఈ భవనాల నిర్మాణాలపై దృష్టి సారించి పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాకపోవడం వల్లే..

నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణాలపై ఎంఈవో ఆనందరావు వద్ద ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట అదనపు పాఠశాల భవన నిర్మాణాల కోసం గత ప్రభుత్వ నాడు-నేడు పథ కం ద్వారా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడం మూలంగా ఈ పాఠశాల భవన నిర్మాణాలు చాలావరకు పునాది దశలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు.